# మోడల్ జనగామే లక్ష్యం

- నేను ఇష్టపడి ఇక్కడికి వచ్చాను
- నా బలం, బలగం ప్రజలే
- ఆశీర్వదిస్తే ఐదేండ్లు పాలేరునైతా..
- 4వ నంబర్ కారుగుర్తుపై ఓటేయండి
- అభివృద్ధి పనులకే ప్రగతి భవన్ వెళ్తా
- ప్రజా సమస్యలపై తక్షణమే స్పందిస్తా
- నీలిమ మెడికల్ కాలేజీలో ఉచిత వైద్యం
- సిద్దిపేట తరహా జనగామ ప్రగతి
- 'నమస్తే తెలంగాణ'తో జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి



జనగామ/చేర్యాల, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): 'తరిగొప్పుల పక్కనే మా సొంతూరు జిల్లాల పునర్విభజనతో వేరైంది తప్ప నేను పరాయి వాడ్ని కాదు.. పక్కా లోకల్. తెలంగాణ ఉద్యమంలో పోలీసుల దెబ్బలు తిని జైలు జీవితం గడిపిన అసలు సిసలైన ఉద్యమకారుడిని. ఇకపై నా స్థిర నివాసం జనగామే' అని జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమం, తెలంగాణ సాధన పోరాటం, ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కలిసి నడిచిన అనుభవాలు, జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ఏం చేస్తాననే అంశాలను ఆయన పంచుకున్నారు.

**జనగామలోనే స్థిర నివాసం**

జనగామ జిల్లా కేంద్రంగా స్థిర నివాసం ఉంటా.. కేవలం నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం మాత్రమే ప్రగతి భవన్‌కి వెళ్తా.. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందిస్తా.. అర్ధరాత్రి ఫోన్ చేసినా అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. మంచి ఎవ్వరి వద్ద నుంచి అయినా నేర్చుకుంటా.. చిన్నా పెద్ద తేడా అనేది నాకు లేదు. ఇక నుంచి నీలిమ మెడికల్ కాలేజీ దవాఖానలో జనగామ నియోజకవర్గ ప్రజలకు ఎంత ఖర్చయినా ఉచిత వైద్యం అందించే బాధ్యత తనది అని తెలిపారు. 2014లో ఎంపీగా, 2015లో పట్టభద్రుల ఎమ్మెల్సీగా, 2021లో ఎమ్మెల్సీ గ్ర్యాడ్యుయేట్‌గా ప్రజలకు అనేక సేవలందించా.. ఇక ఎమ్మెల్సీ పరిధిలో 34 నియోజకవర్గాలు ఉంటే ఆయా నియోజకవర్గ ప్రజలు, నాయకులు కూడా నన్ను ఆదరించారు. కాబట్టే ప్రతి జిల్లాకి వెళ్లాల్సి వచ్చేది. సీఎం కేసీఆర్ మాటను తూచ తప్పకుండా పాటించే నమ్మకమైన వ్యక్తిగా నాకు పేరుంది. 2015లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించి 50 లక్షల సభ్యత్వాలు చేయించి మంచిపేరు తెచ్చుకున్నానన్నారు. నా పనితనాన్ని మెచ్చిన పెద్దసార్(కేసీఆర్) అనేక పనులకు ఇన్‌చార్జిగా నియమించారు. పథకం రైతుబంధు, రైతు బీమా అమలు బాధ్యతలకు సంబంధించి రైతు సమన్వయ సమితి చైర్మన్ పదవి ఇచ్చారన్నారు. కొన్నేళ్ల పాటు పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా, మండలి విప్‌గా పనిచేశాను. పార్టీ ప్లీనరీలు, సభ్యత్వ నమోదు, ఎన్నికల ప్రణాళిక, బహిరంగ సభల నిర్వహణతో పాటు ప్రచార బాధ్యతలు చేపట్టి ఉత్తమ పనితనం చూపించినట్లు చెప్పారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచార సభల నిర్వహణ బాధ్యతను కూడా స్వయంగా దగ్గరుండి చూసుకున్న.. వరంగల్ ఎంపీ, పాలేరు అసెంబ్లీ ఉప ఎన్నికలు, జీహెచ్ఎంసీ, ఖమ్మం కార్పొరేషన్, 2019లో ఖమ్మం ఎంపీ, హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికల ఇన్‌చార్జిగా పనిచేసి ఆ స్థానాల్లో పార్టీ విజయానికి కృషి చేసినట్లు తెలిపారు. ఎన్నికలు ఎక్కడ జరిగినా శాయశక్తులా కృషి చేశాను. ఇక్కడ కూడా అదే వ్యూహం అనుసరిస్తున్న.

**పరిశ్రమల ఏర్పాటు బాధ్యత నాదే..**

ఊరు, వాడ, తండాల్లో ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రజల ఆశీస్సులతో నేను గెలవడం పక్కా. నిరుద్యోగులు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతాన్ని పారిశ్రామిక కారిడార్‌గా చిన్న, మధ్యతరహా, పెద్ద పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన జరిగేలా చూసే బాధ్యత నాదే అని స్పష్టం చేశారు. పామాయిల్ కంపెనీలు, రైస్ ఇండస్ట్రీ, నిరుద్యోగ నిర్మూలన కోసం ఐటీ హబ్‌ను తెచ్చే ప్రయత్నం చేస్తా.. ప్రభుత్వ నర్సింగ్, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాలల నిర్మాణానికి కృషి చేస్తా. జనగామ అనేది కేసీఆర్ మానస పుత్రికగా వచ్చే ఐదేండ్లలో సిద్దిపేటకు ధీటుగా జనగామ రూపురేఖలను మారుస్తా. గ్రామ, మండల, నియోకవర్గ ప్రణాళికలను తయారు చేసుకొని నియోజకవర్గ సమగ్రాభివృద్ధిని బాధ్యతగా తీసుకుంటా. గెలుపుపై పూర్తి ధీమాగా ఉన్నాను. అని బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు.

**కాంగ్రెస్, బీజేపీని నమ్మితే ఆగమే..**

తప్పిపోయి కాంగ్రెస్ చేతికి అధికారం అప్పగిస్తే అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ పాతాళంలోకి జారిపడుతుంది. అన్ని వర్గాల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుంది. బీజేపీ గెలువది, కాంగ్రెస్ లేవదు జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేస్తున్నాం. కాంగ్రెస్ అధికారంలో ఉండగా తాగునీటి కోసం మహిళలు బిందెలతో రోడ్లపైకి వచ్చేవారని గుర్తుచేశారు. పార్టీలకతీతంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులకు కూడా అందజేస్తున్నామని చెప్పారు. కర్ణాటకలో పింఛన్ రూ.600 ఉంటే తెలంగాణలో రూ.2,000 ఉంది. అక్కడ ఎందుకు పింఛన్ ఎక్కువ ఇవ్వడం లేదని ప్రశ్నించారు. 'కాంగ్రెస్ హయాంలో జనగామ ఎట్లుండె.. ఇప్పుడు ఎట్లుందో ఒక్కసారి ఆలోచించండి.. అభివృద్ధి మీ కండ్ల ముందున్నది. ఒకనాడు కరువు విలయ తాండవం చేసిన ఎగువ ప్రాంతాన్ని గోదావరి జలాలతో సస్యశ్యామలం చేసిన బీఆర్ఎస్‌ను మరోసారి ఆశీర్వదించాలి. అని కోరారు.

# విధి నిర్వహణలో అలసత్వం వద్దు

చేర్యాల, నవంబర్ 29: ఎన్నికల విధి నిర్వహణలో అధికారులు, సిబ్బంది అలసత్వం వహించరాదని చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి సూచించారు. పట్టణంలోని శివప్రసన్న ఫంక్షన్ హాల్‌లో బుధవారం చేర్యాల పోలీస్ సర్కిల్ పరిధిలో విధులు నిర్వహించే రూట్ మొబైల్ అధికారులు, సిబ్బందితో పాటు పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే అధికారులకు, సిబ్బందికి ఎన్నికల రోజు గురువారం నిర్వహించాల్సిన విధులపై దిశానిర్దేశం చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఈవీఎం, వీవీ ప్యాట్, ఎన్నికల సామగ్రి రక్షణ పూర్తి బాధ్యత రూట్ మొబైల్ అధికారులదేనన్నారు. రూట్ మొబైల్‌లో ఉన్న పోలింగ్ కేంద్రాల వద్ద 24గంటల పాటు వాహనాలు పెట్రోలింగ్ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరిగితే వెంటనే రూట్‌మొబైల్ అధికారులు అక్కడికి చేరుకొని పరిష్కరించాలన్నారు. పోలీస్ ఉన్నతాధికారులు ఘటన వివరాలు తెలియజేయాలన్నారు. ఎన్నికల రోజు అధికారులు, సిబ్బందికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద విధులు నిర్వహించే సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లో పోలిం గ్ సామగ్రిని వదిలి వెళ్లవద్దని ఆదేశించారు. ప్రతి ఎన్నిక కొత్త అనుభవాన్ని నేర్పిస్తుందని, అధికారులు సమష్టిగా సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులతోపాటు ప్రజలు ఎన్నికల ప్రవర్తనా నియమావలిని పాటించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రజలు నిర్భయంగా ఓటు వేసేందుకు పోలీస్‌శాఖ అన్ని రక్షణ చర్యలు చేపట్టిందన్నారు.



చేర్యాల పట్టణంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న సీఐ సత్యనారాయణరెడ్డి

# ఆకర్శణీయంగా మోడల్ పోలింగ్ కేంద్రాలు

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 29: నేడు జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మద్దూరు మండల కేంద్రంలో మోడల్ పోలింగ్ కేంద్రంతోపాటు ఉమెన్ మేనేజ్డ్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మద్దూరు ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన 79వ పోలింగ్ కేంద్రంలో మహిళా అధికారులు, సిబ్బందితో పోలింగ్ కేంద్ర నిర్వహణ జరుగుతున్నది. 80వ పోలింగ్ కేంద్రాన్ని మోడల్ పోలింగ్ కేంద్రంగా ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో మోడల్ పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేకంగా స్వాగత తోరణంతో పాటు క్యూలైన్‌లను మామిడి తోరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మోడల్ పోలింగ్ కేంద్రాల్లో అధునిక వసతులను సమకూర్చినట్లు ఆర్ఐ రమేశ్ తెలిపారు. మోడల్ అండ్ ఉమెన్ మేనేజ్డ్ పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు పరిశీలించారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.




మద్దూరులో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం

## రాత్రి కరెంటుతో మస్తు తిప్పలు పడ్డం



చిన్నకోడూరు, నవంబర్ 29: కాంగ్రెసోళ్లు రాత్రిపూట కరెంటిచ్చి మస్తు మంది రైతులను పొట్టనపెట్టుకున్నరు. రైతులు ఎవరైనా ఆ బాధలు మర్సిపోతరా. రైతులకు ఏమి సేయనోళ్లు ఇప్పుడు ఊళ్లకు వచ్చి ఓటు మాకు వెయ్యాలని అడిగింద్రు. మస్తుసార్ల కాంగ్రెసోల్లకు ఓట్లు ఏసినం. ఏం జేసింద్రు. 3 గంటల కరెంటిస్తమని తిరుగుతుంద్రు. రైతులకు మంచి చేయాలని చంద్రశేఖర్ మంచిగా 24 గంటల కరెంట్ ఇస్తున్నడు. పుట్లకొద్ది వడ్లు పండుతున్నయ్. రైతులు సంతోషంగా ఉన్నరు.

– పోరెడ్డి లక్ష్మి, ఇబ్రహీంనగర్

## ధరణి రాకముందు పంచాయితీలే..



చిన్నకోడూరు, నవంబర్ 29: ధరణి రాకముందు మా ఊళ్లో రోజూ భూముల పంచాయితీలు జరిగేవి. రాత్రికి రాత్రే ఒకరి భూమి మరొకరి పేరుమీదికి ఎక్కేది. రైతుల పరిస్థితులు గోరంగా ఉండేవి. ఆఫీసుల చుట్టు ఎంత తిరిగినా పని మాత్రం కాకపోయేది. ఎవరిని అడిగినా పట్టించుకునే పరిస్థితి లేకుండే. పైరవీకారులు చేసిన పనికి జాగ ఒక దగ్గర ఉంటే రిజిస్టర్ ఒక దగ్గర ఉండేది. ఇప్పుడు ధరణిలో రిజిస్టర్ చేసుకుంటే మన కండ్లముందే మన పేరు మీదికి ఎక్కుతున్నది. సీఎం కేసీఆర్ సార్‌తో భూ సమస్యలు తీరినయ్.. ధరణి తీసేస్తే మళ్లి పాత రోజులే వస్తాయి.

– యాసరేని మల్లయ్య, రామునిపట్ల

## కొడుకుకు పోలీస్ ఉద్యోగం వచ్చింది



చేర్యాల, నవంబర్ 29: మా కొడుకు భానుకు ఎలాంటి పైరవీలు లేకుండా పోలీస్ ఉద్యోగం వచ్చింది. పోలీస్ ఉద్యోగంపై మక్కువతో రెండేండ్లు మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఇప్పించిన శిక్షణను సద్వినియోగం చేసుకున్నడు. పోలీస్ కానిస్టేబుల్ ఫలితాలలో ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం శిక్షణ పొందుతున్నాడు. ఎస్ఐ ఉద్యోగం కూడా కొన్ని మార్కులతో పోయింది. ప్రభుత్వం పారదర్శకంగా ఉద్యోగాలు భర్తీ చేయడంతో మా కొడుకుకు ఉద్యోగం వచ్చింది.

– ఏ.గదరాజు లింగం

## పిల్లల చదువే ముఖ్యమని కష్టపడ్డాం



సిద్దిపేట, నవంబర్ 29: ఆస్తిపాస్తులు కాదు పిల్లల చదువే ముఖ్యమని కష్టపడి చదివించాం. మాకు ముగ్గురు ఆడపిల్లలు. ప్రైవేటు ఉద్యోగం చేస్తూనే వారిని చదివించాం. చిన్నప్పటి నుంచి పిల్లల సదువు కోసం కష్టపడ్డాం. ఇంజినీరింగ్ చేపించాం. రెండో కుతురు సుమేరా నాజ్ ఇంజినీరింగ్ పూర్తి చేయగానే హైదరాబాదులోని మెడ్ ఇస కోచింగ్ సెంటర్ కోఠిలో ఒక సంవత్సరం, ఏఎస్ కోచింగ్ సెంటర్ దిల్‌సుఖ్‌నగర్‌లో నాలుగు నెలలు కోచింగ్ ఇపించాం. తెలంగాణ ప్రభుత్వం టీఎస్ ట్రాన్స్‌కో ఏఈల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగానే పరీక్ష రాసింది. ఏఈగా ఎంపికైంది. 2020 జనవరి 24 తేదీన ట్రాన్స్‌కోలో ఉద్యోగంలో చేరింది. ప్రస్తుతం కరీంనగర్ ఎస ట్రాన్స్‌కో హెడ్ క్వార్టర్‌లో ఏఈగా బాధ్యతలు నిర్వర్తిస్తుంది. మేం పడిన కష్టానికి మా బిడ్డ ఉద్యోగం సాధించి మా నమ్మకాన్ని నిలబెట్టింది. ఇదంతా ప్రభుత్వ చిత్తశుద్ధితోనే జరిగింది.

– షఫీ ఉన్నిసాబేగం, రెహమాన్ ఖమర్